
సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 21 । జనవరి । 2025



డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం
నార్నూర్ మండలం మాలేపూర్ శివారులో డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఐచర్ వ్యాన్ బోల్తాపడిన ఈ ఘటనలో మరొకరు చనిపోయారు. 8లో▸



దుండగులను శిక్షించాలని నిరసన
ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ జిల్లాలోని పలు పాఠశాలల్లో నిరసన వ్యక్తం చేశారు. 9లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
30.0 /13.0
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పశ్చిమ వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

సివిల్ సర్వీసెస్ టోర్నీకి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం ఏటా నిర్వహించే అఖిల భారత సివిల్ సర్వీసెస్ టోర్నమెంటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23, 24వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంటులో పాల్గొని ఎంపిక కావాల్సి ఉంటుందని తెలిపారు. అథ్లెటిక్స్, క్రికెట్, చెస్, క్యారం, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, రెజ్లింగ్, గ్రీకో రోమన్, ఖోఖో, యోగా విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల సివిల్‌సర్వీసెస్ ఉద్యోగులు ఈ నెల 21న మధ్యాహ్నం 2గంటల్లోపు తమ కార్యాలయంలో సంప్రదించాలని, ఇతర వివరాలకు 9963539234 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ ప్రీఫైనల్ పరీక్షలు ప్రారంభం



పరిశీలిస్తున్న డీఐఈవో అంజయ్య

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తూ ప్రీ ఫైనల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. సెకండ్ లాంగ్వేజ్(తెలుగు, ఉర్దూ, హిందీ) పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్ష రాశారు. లక్సెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు పలు కళాశాలల్లో పరీక్ష నిర్వహణను డీఐఈవో అంజయ్య పరిశీలించారు.

వచ్చే నెలలో డిప్యూటీ సీఎం పర్యటన

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో వచ్చే నెల 9, 10వ తేదీల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పర్యటిస్తారని, ఆలోపు పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున నిర్మిస్తున్న మహాప్రస్థానం పనులను సోమవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాప్రస్థానం, నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వారికి చూపించి మరిన్ని నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. గ్రీన్ క్రిమిటోరియం అనేది దేశంలోనే హర్యానా, పంజాబ్‌లో ఉండగా, రాష్ట్రంలో మంచిర్యాలలో మాత్రమే సోలార్ పవర్‌ను పూర్తిగా అందించనున్నామని తెలిపారు. 50కిలోవాట్ల సోలార్‌తో నెలకు 6 వేల యూనిట్లు విద్యుత్ వస్తుందని తెలిపారు. గతంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఎల్లంపల్లి ప్రాజెక్టులో నుంచి మట్టి, ఇసుక అమ్ముకున్నారని, తాను అమ్ముకుంటున్నట్లు లేనిపోని ఆరోపణలు చేస్తున్నా ప్రజలు నమ్మరని అన్నారు. మహాప్రస్థానం పనులకు ఎలాంటి బిల్లులు పెట్టకుండా మట్టిని తరలిస్తున్నామని స్పష్టం చేశారు.


కార్మికుల రిలే నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న కార్మికులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల–రంగపేట శివారులో ఉన్న శాలీవాహన గ్రీన్ ఎనర్జీపవర్ ప్లాంటు కార్మికులు సోమవారం ప్లాంట్ గేటు ఎదుట రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ప్లాంటు మూసి వేసి 26 నెలలు గడుస్తున్నా యాజమాన్యం కార్మికులకు అలవెన్స్‌లు, బెనిఫిట్‌లు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. నెలాఖరులోగా డబ్బులు చెల్లించకుంటే గుడిసెలు వేసుకుని ఇక్కడే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, కార్యదర్శి సత్యం, ఆనందరావు, పెంట సత్యం, ఆసరి రాజయ్య, శ్రీశైలం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్.. చీటింగ్!



మంచిర్యాల పట్టణంలోని తిరమలగిరి కాలనీకి చెందిన దినేష్(పేరు మార్చాం) బీటెక్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో జాబ్ కోసం వెతుకుతూ ఓ వెబ్ లింకును క్లిక్ చేశాడు. ప్రతిగా వారు ఇంటి వద్ద ఉంటూనే కొంత సొమ్ము పెట్టుబడి పెడితే రెట్టింపు వస్తుందని తెలిపారు. మొదట్లో కొంత సొమ్మును సదరు వెబ్‌లింకు ద్వారా పంపించిన ఖాతా నంబర్‌కు పంపించాడు. మొదటిసారి రూ.20 వేలు పంపించగా దినేష్ బ్యాంకు ఖాతాలోకి 15 రోజుల తర్వాత లాభం రూపంలో రూ.10 వేలు పంపించారు. దీంతో దినేశ్ రూ.2 లక్షల వరకు చెల్లించాడు. చివరికి వారి ఫోన్ నంబర్లు, వాట్సాప్ గ్రూప్‌లు అన్ని బ్లాక్ చేశారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయగా అదంతా మోసం అని తేలింది.

మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి నెలకు వేలల్లో వేతనం తీసుకుంటున్నాడు. అయినా ఖాళీ సమయంలో డబ్బులు సంపాదించాలనే అత్యాశతో వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ఆన్‌లైన్ టాస్క్‌లో పాల్గొన్నారు. మొదట్లో డబ్బులు వస్తున్నట్లే వచ్చి చివరికి రూ.4 లక్షల వరకు పోగొట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగి మహిళా కావడంతో ఎవరికైనా చెబితే పరువు పోతుందని పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో స్థానిక నస్పూర్‌లోని రాంనగర్‌కు చెందిన అడెపు శివకుమార్ రూ.1,57,319 సైబర్ మోసాగాళ్ల చేతిలో నష్టపోయారు. ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లో పార్ట్ టైం ఉద్యోగం ప్రకటన లింక్ ఓపెన్ చేయగా టెలిగ్రామ్ యాప్‌లో సయ్యద్ మెకలిన్ అనే ప్రొఫైల్స్‌తోపాటు మరి కొంత మందికి చెందిన ప్రొఫైల్స్ ఓపెన్ అయ్యాయి. గ్రూప్ వెబ్‌సైట్‌లో కొంత పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పడంతో పలు దఫాలుగా రూ.1,57,319 ఫోన్ పే ద్వారా పంపించాడు. తర్వాత సదరు వ్యక్తుల నుంచి సమాధానం రాకపోవడం, ఫోన్లు స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- కూర్చున్న చోటే ఉద్యోగాలంటూ యువతకు సైబర్ వల
- చిక్కుకున్నాక రూ.వేల నుంచి రూ.లక్షల్లో దోపిడీ
- జిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ జాబ్ బాధితులు

మంచిర్యాలక్రైం: కష్టపడకుండా డబ్బులు ఎవరికీ రావు.. అలా వచ్చిన డబ్బులు ఎక్కువ కాలం నిలవవు. ఈ విషయం తెలియక నేటితరం యువత ఈజీ మనీ కోసం ఆన్‌లైన్‌లో ప్రకటనలు చూసి పెట్టుబడులు పెడుతున్నారు. రెట్టింపు సొమ్ము ఇస్తామని, అధిక వడ్డీ ఇస్తామనే ప్రకటనలు చూసి మోసపోతున్నారు. ఇదే అదునుగా సైబర్ నేరగాళ్లు ఉన్నది కాస్త ఊడ్చేస్తున్నారు. పార్ట్‌టైమ్ జాబ్స్.. అత్యధిక వేతనం అంటూ ఆశ చూపి అందినకాడికి దండుకుంటున్నారు. జిల్లాలో ఇలాంటి మోసాలు ఇటీవల పెరుగుతున్నాయి. కేటుగాళ్ల బారిన పడిన బాధితుల్లో కొందరు చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మరి కొందరు పరువు పోతుందని ఫిర్యాదు చేయడం లేదు.

ఆశ చూపి..

చాలామంది ఎక్కువగా ఇంటి వద్ద ఉంటూ పార్ట్ టైమ్ జాబ్ చేయడానికి ఇష్టపడుతున్నారు. ఖాళీ సమయంలో పనిచేస్తే ఎంతో కొంత సంపాదించవచ్చని భావిస్తున్నారు. ఇలాంటి వారినే జాబ్ స్కామర్లు టార్గెట్ చేస్తున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపుతున్నారు. ఆన్‌లైన్‌లో తరచూ ప్రకటనలు ఇస్తూ ఆకర్షిస్తున్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, పట్టణాల్లోని పబ్లిక్ ప్లేస్‌ల వద్ద నోటీస్ స్టిక్కర్లు అతికిస్తున్నారు. జాబ్ దొరకడమే కష్టమైన నేటి రోజుల్లో ఈ ప్రకటనలు నిరుద్యోగులను కూడా ఆకర్షిస్తున్నాయి.

బ్లాక్ మెయిల్...

డేటా ఎంట్రీ స్కామ్ రకరకాలుగా ఉంటాయి. ఎక్కువ నైపుణ్యం అవసరం లేకుండానే సులువుగా డేటా ఎంట్రీ చేస్తే చాలు డబ్బులు సంపాదించొచ్చని నమ్మబలుకుతారు. ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో ముందస్తు చెల్లింపు చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులు ఉన్నాయని, సంస్థ నష్టపోయిందని, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తారు. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటారని బెదిరిస్తారు. దీంతో కొందరు భయంతో డబ్బులు చెల్లిస్తున్నారు. ఇలా జిల్లా కేంద్రంలోని ఓ యువతిని డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఓ సంస్థ నియమించుకుని డేటా ఎంట్రీ చేసిన తర్వాత తప్పుల కారణంగా కంపెనీ నష్టపోయిందని సదరు యువతి నుంచి రూ.2 లక్షలు వసూలు చేశారు.

నిజం వంటి అబద్ధం..

నకిలీ ఉద్యోగాల్లో సైబర్ నేరగాళ్ల వద్ద అందరి బయోడేటా ఉంటుంది. ఆన్‌లైన్ జాబ్ సెర్చింగ్ సైట్లకు జనం ఇచ్చే బయోడేటాలు వీరు సేకరిస్తుంటారు. ఒక కాల్ సెంటర్ వంటి సెటప్ ఏర్పాటు చేసుకుని జాబ్ కన్సల్టెన్సీ ముసుగులో వారి నుంచి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లుగా మోసపూరిత మెయిల్స్ పంపిస్తారు. ఆ మెయిల్‌కు స్పందిస్తే... అసలైన జాబ్ నిర్వహించే ప్రక్రియనే వీరూ అనుసరిస్తారు. అలా మోసం చేస్తూ నిరుద్యోగి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు, యూనిఫాం, అడ్వాన్స్ సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో దోచుకొని తర్వాత మాయమైపోతారు.

చదువుకున్నవారే మోసపోతున్నారు



చదువుకున్న వారు.. నిరుద్యోగులు.. ఉద్యోగాల వేటలో పడి.. ఆశపడి నమ్మి మోసపోతున్నారు. ఉద్యోగాల కోసం డబ్బులు ఇవ్వడం అనేది తప్పు. ఎవరైనా డబ్బులు ఇస్తే పలానా ఉద్యోగం వస్తుంది అంటే అది మోసమే అవుతుంది. మన చేతిలో డబ్బు పోయిన తర్వాత రావడం కష్టం. ఎలాంటి పెట్టుబడి లేకుండా ఇంటి వద్దనే ఉంటూ లక్షలు సంపాదించవచ్చని సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు నమ్మొద్దు. సైబర్ నేరగాళ్లు ఏ క్లిక్‌లో పొంచి ఉంటారో తెలియదు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ప్రకటనలు క్లిక్ చేయకూడదు. ఎవరికీ వ్యక్తిగత సమచారం ఇవ్వొద్దు. ఆన్‌లైన్ జాబ్ ప్రకటనలు ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. మోసపోయమని గ్రహిస్తే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.

– ఎం.శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనర్

ఇలా గుర్తించాలి...

- ఉద్యోగ ప్రకటనలు అన్నీ నిజం కావు అనే సత్యాన్ని గ్రహించాలి.
- సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ పేరిట నగదు వసూలు చేయవు.
- ప్రకటనల్లో ఉపయోగించే సంస్థ లోగోలు, లెటర్లను ఒకటికి రెండుసార్లు గమనించాలి.
- అసలైన సంస్థ ఎప్పుడూ ఈ–మెయిల్ ద్వారానే సమాచారం ఇస్తారు. కాని జాబ్ స్కామ్/ఫ్రాడ్ చేసే వారు. పంపే మెయిల్‌ను గమనిస్తే కాస్త తేడాగా ఉంటాయి.
- జాబ్‌స్కామ్ వారు ఇచ్చే ఉద్యోగ ప్రకటనల్లో, ఈ–మెయిల్స్‌లో ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా అస్పష్టంగా ఉంటుంది.
- క్విక్ మనీ, అన్ లిమిటెడ్ ఎర్నింగ్స్, ఎలాంటి టెక్నికల్ స్కిల్స్ అవసరం లేదు అనే పదాలు చూసిన వెంటనే అప్రమత్తమవ్వాలి. ఒక చట్టబద్ధమైన సంస్థ ఎప్పుడూ ఇలాంటివి చేయదన్న విషయాన్ని గ్రహించాలి.
- ఇలాంటి మోసాలకు గురయ్యేవారు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.

టీచర్ల స్పౌజ్ బదిలీలు

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల స్పౌజ్ కేటగిరీ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 317జీవో ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించిన స్పౌజ్(భార్యాభర్తల) బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేబినెట్ సబ్‌కమిటీ నివేదిక ఆధారంగా విడుదల చేసిన జీవో నంబరు 243 ద్వారా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. సోమవారం జీవో 2, 3 విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జీవో నం.2ద్వారా 698మంది ఉపాధ్యాయులను, జీవో నం.3 ద్వారా 136మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భార్యాభర్తలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ నుంచి ఇద్దరు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 30 మంది టీచర్లు మంచిర్యాలకు.. మంచిర్యాల జిల్లా నుంచి ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌కు ఒక్కొక్కరు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఆదిలాబాద్‌కు 29మంది స్పౌజ్ కింద బదిలీ అయ్యారు. గతంలో ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, ఆదిలాబాద్(ఇన్‌కమింగ్) బ్లాక్‌లిస్టులో చేర్చడం వల్ల ఉపాధ్యాయులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ రెండు జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చినా ఇక్కడికి వద్దామనుకున్నా ఉపాధ్యాయులకు చుక్కెదురైంది. స్పౌజ్‌లో ఎవరైనా ఇతర జిల్లాలో పనిచేస్తే అక్కడికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారో లేదో చెప్పాలంటూ అంగీకార పత్రాలు సమర్పించాలని పేర్కొనడంతో ఆందోళనకు గురయ్యారు. మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలు బ్లాక్‌లిస్టులో ఉండడంతో ఆయా జిల్లాలో పనిచేస్తున్న భార్యాభర్తలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గత ప్రభుత్వం జీవో 317 ఇవ్వగా చాలామంది భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అప్పట్లో స్పౌజ్ కేటగిరీలో కొందరికి న్యాయం జరగ్గా.. మరికొందరిని ఒకే జిల్లాకు అలాట్ చేయలేదు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రభుత్వం ఉపాధ్యాయ దంపతులు ఒకే చోటికి బదిలీ చేయనుండడంతో ఊరటనిస్తోంది.

ప్రతీ దరఖాస్తు పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్‌రావులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రతీ దరఖాస్తుదారుని సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల చూపు మందగిస్తోంది..

- 35,964 మంది పిల్లలకు కంటి పరీక్షలు
- 1143 మంది కళ్లద్దాలు అవసరం
- ప్రభుత్వానికి ఆర్‌బీఎస్‌కే నివేదిక



పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యబృందం

మంచిర్యాలఅర్బన్: ఒకప్పుడు పిల్లలు మారాం చేస్తే గోరుముద్ద తినిపించేందుకు చందమామను చూపించేవారు. ఈతరంలో పిల్లలు అన్నం తినాలంటే సెల్‌ఫోన్ చేతికి ఇస్తున్నారు. గతంలో విద్యాలయాల్లో తరగతి గదిలో ఒకరిద్దరికి కళ్లద్దాలు కనిపించేవి. ప్రస్తుతం ఒక్కో గదిలో పది మంది వరకు పిల్ల లకు కళ్లద్దాలు ఉంటున్నాయి. మూడేళ్లకే పాఠశాలకు పంపించడం.. పోషకాహారం లోపించడం.. వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం.. సమయం దొరికితే చాలు టీవీ, కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్‌తో విరామం లేకుండా గడిపేయడం వల్ల కంటిచూపు మందగిస్తోంది. ఆటస్థలాల్లో కంటే గదిలోపల డిజిటల్ స్క్రీన్లలో ఆటలకే మొగ్గు చూపడంతోనూ కంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఆర్బీఎస్‌కే(రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆప్తాలమిక్ అధికారులతో కలిసి వైద్యులు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. తరగతి గదిలో బోర్డుపై రాసి ఉన్నా కనిపించకపోవడం(దూర దృష్టి), పుస్తకాల్లోని అక్షరాలు చదవలేక ఇబ్బందులు పడుతున్నట్లు నిర్ధారించారు. 1143మంది చిన్నారులకు కళ్లద్దాలు అవసరమని నివేదికలో వెల్లడి కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ లెక్కలు ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య పరీక్షలు నిర్వహించినవి మాత్రమే. ఆటస్థలాలు అంతగా లేని, ఇరుకు భవనాల్లో చదువులు కొనసాగే ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారులకు కంటి సమస్య రెట్టింపు ఉండే అవకాశాలు ఉన్నాయి.

పరీక్షలు ఇలా..

జిల్లాలో ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో ఎనిమిది బృందాలు పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశాయి. వీరిలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి(ఇంటర్ కూడా) విద్యార్థులు ఉన్నారు. మొదటి దఫా గత ఏడాది ఏప్రిల్‌లో వసతిగృహాలు, రెండో దఫాలో ఆగస్టు నుంచి నవంబర్ 6వరకు వసతిగృహ విద్యాలయాలు, రెసిడెన్షియల్, ప్రభుత్వ పాఠశాలల్లో కంటి పరీక్షలు చేశారు. ఇందులో 35,964మందిని పరీక్షించి 1,143మందికి కళ్లద్దాలు అవసరమని, 26 మంది ఇతర కంటి సమస్యలతో బాధపడుతున్నారని నివేదికలో పేర్కొన్నారు. మొదటి దఫా కంటి పరీక్షల్లో 148 మంది బాలురు, 301 మంది బాలికలు, రెండో విడత పరీక్షల్లో 278 బాలుర, 416 మంది బాలికలకు కంటి అద్దాలు అవసరమని నివేదించారు. ఈ లెక్కన బాలుర కంటే బాలికలే కంటి చూపు సమస్యతో బాధపడుతున్నట్లు తేలింది.

పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ..

పల్లె ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంత విద్యార్థుల్లోనే కంటిచూపు మందగిస్తున్నట్లు తేలింది. పట్టణ ప్రాంతాల్లో ఆటస్థలాలు లేకపోవడంతో ఆరుబయట ఆటలు(ఫిజికల్ యాక్టివిటీస్) ఎప్పుడో మరిచిపోవడంతోనే సమస్యలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. చాలామంది పిల్లలు పుస్తకాలను కళ్లకు దగ్గరగా పెట్టుకోవడం.. డిజిటల్ స్క్రీన్ ఎక్కువగా చూడడం.. పడుకుని తక్కువ వెలుతురులో, ఇంకొందరు రకరకాలగా చదవడం వల్ల కళ్లపై ఒత్తిడి పెరిగి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి.

జాగ్రత్త అవసరం..



ప్రతీరోజు రెండు మూడుసార్లు చేతులు శుభ్రం చేసుకోవాలి. చిన్నారులు దుమ్ములో తిరగకుండా చూసుకోవాలి. టీవీ, కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్లకు దూరంగా ఉంచేలా తల్లిదండ్రుల నియంత్రణ అవసరం. ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. సహజ వెలుతురులో సమయం గడపడం.. శరీరానికి ఆరోగ్యంగా ఉంచే క్రీడలు, వ్యా యామం, తదితర ఫిజికల్ యాక్టివిటీస్ పెంచాలి. ఆరోగ్యకరమైన ఆహారం అందించడం(విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలు), ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తినేలా చూడడం, గ్లాసు పాలు తాగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– యశ్వంత్‌రావు, నేత్ర వైద్యనిపుణుడు

ఎక్కువ మంది చిన్నారుల్లో దూరదృష్టి లోపం ఉన్నట్లు తెలుస్తోంది.

లెక్క తేలిన రైతు భరోసా

- 3వేల ఎకరాలకు పెట్టుబడి సాయం దూరం
- సాగులో లేని భూములుగా అధికారుల గుర్తింపు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేల పెట్టుబడి సాయంపై సాగు భూములపై సర్వే చేసిన విషయం తెలిసిందే. సాగు యోగ్యం కాని భూములకు పెట్టుబడి సాయం నిలిపివేసేందుకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేశారు. జిల్లాలో 371రెవెన్యూ గ్రామాల పరిధిలో మొత్తం 3054.473ఎకరాలు సాగులో లేనట్లుగా గుర్తించారు. ఇంతకాలం ఈ భూములకు సైతం రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందుతూ వస్తోంది. తాజాగా ప్రభుత్వం సాగులో లేని గుట్టలు, కొండలు, దారులు, రియల్ వెంచర్లు, నివాస స్థలాలు, గుంటల్లో ఉన్న విస్తీర్ణం, ఇతరత్రా సాగేతర వినియోగంలో ఉన్న భూములు గుర్తించారు. ఇక నుంచి ఆ భూములకు పెట్టుబడి సాయం నిలిపివేయనున్నారు. ఈ క్రమంలో జిల్లాలో రైతు భరోసా కింద గతంలో అందిన పెట్టుబడి సాయం కన్నా తగ్గనుంది. అంటే గతంలో 3లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం అందేది. ప్రస్తుతం ఇందులో మూడు వేల ఎకరాలు తగ్గనుంది. నేటి నుంచి మొదలయ్యే గ్రామసభల్లో అర్హుల వివరాలు వెల్లడిస్తారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులను ప్రకటించనున్నారు. ఎవరైనా పథకాలకు అర్హత ఉండి జాబితాలో తమ పేర్లు లేకపోతే మళ్లీ గ్రామసభల్లోనే దరఖాస్తులు ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దంటూ ఆందోళన

- నర్సింగాపూర్ గ్రామస్తుల నిరసన
- అధికారుల హామీతో విరమణ



ఆందోళనలో నర్సింగాపూర్ గ్రామస్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామాన్ని మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దంటూ గ్రామస్తులు ఆందోళన బాటపట్టారు. సోమవారం గ్రామంలో సమావేశమై విలీనాన్ని అడ్డుకోవాలని నిర్ణయించారు. గ్రామ పంచాయతీగానే కొనసాగించాలంటూ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారిపై ధర్నాకు కాలినడకన బయల్దేరారు. దీంతో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా గ్రామస్తులు వినకపోవడంతో ధర్నా చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో జాతీయ రహదారి పక్కన బైఠాయించారు. కలెక్టర్ వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామంటూ మూడు గంటలపాటు నిరసన వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్, ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉపాధి పోతుందని ఆవేదన

నర్సింగాపూర్ గ్రామంలో 70శాతం మంది ఉపాధి కూలీ పనిపై ఆధారపడి జీవిస్తున్నారని, ఏడాదిలో వంద రోజుల ఉపాధి లభిస్తుందని, కార్పొరేషన్‌లో విలీనం వల్ల ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండ్రోజుల్లో తమకు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ చిహ్నాలపై ప్రదర్శన



ప్రదర్శనలో విద్యాసాగర్

తాండూర్: మండలంలోని మాదారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విద్యాసాగర్ సోమవారం తెలంగాణ రాష్ట్ర చిహ్నాలపై న్యూఢిల్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆజాది అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎన్ఈపీ 2020 ఇన్ సర్వీస్ ట్రైనింగ్‌కు దేశంలోని తొమ్మిది రాష్ట్రాల నుంచి 116 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో 20 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరానికి రాష్ట్రం నుంచి 10మంది ఉపాధ్యాయులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఒకరైన విద్యాసాగర్ తెలంగాణ చిహ్నాలు, అమరవీరుల స్మారక స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహం, దేవాలయాలపై ప్రదర్శన ఇచ్చి ఆకట్టుకున్నారు.

సింగరేణి స్థలాల్లో పట్టాల ఘనత మాదే..

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



స్థానికులతో మాట్లాడుతున్న దివాకర్‌రావు

నస్పూర్: సింగరేణి స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇప్పించిన ఘనత తమ బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలోని అరుణక్కనగర్‌లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అప్పటి సీఎం కేసీఆర్ చొరవతో శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు 2800 మందికి పట్టాలు ఇప్పించామని అన్నారు. దాదాపు 1000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అందరికీ పట్టాలు ఇప్పిస్తామన్న హామీని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందని అన్నారు. రాష్ట్ర నాయకులు నడిపల్లి విజిత్‌రావు, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు మేరుగు పవన్‌కుమార్, ఎం.వెంకటేశ్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



స్వీట్లు తినిపిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: కరీంనగర్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీవరకు 46వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాజట్టు ప్రతిభ కనబ ర్చి తృతీయస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించింది. సోమవారం మంచిర్యాలకు వ చ్చిన జట్టు సభ్యులకు అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతంపలికి స్వీట్లు తినిపించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, పీడీ రేని రాజయ్య,కోచ్ సునార్కర్ అరవింద్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణపై దాడి చేసిన కేసులో సోమవారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..గతనెల 29వ రాత్రి బెల్లంపల్లి బజారుఏరియా ప్రాంతం యూనియన్ బ్యాంక్ వీధిలో ఓ సెలూన్ షాప్‌నకు ఆదినారాయణ వెళ్లగా కొందరు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదైంది. ఈమేరకు నిందితుల్లో ఇద్దరైన రాగంశెట్టి సతీశ్, పూసాల శ్రీకాంత్‌లను అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు పంపించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నీలుగాయి అప్పగింత



అటవీ అధికారులకు అప్పగిస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామ మాజీ సర్పంచ్ ప్రవీణ్ సోమవారం నీలుగాయిని అటవీ అధికారులకు అప్పగించారు. గ్రామ శివారులోని పంట పొలంలో నీలుగాయి కనిపించడంతో మాజీ సర్పంచ్.. అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని నీలుగాయిని నిర్మల్ అటవీశాఖ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ ఎఫ్‌ఆర్‌ఓ అనిత, డిప్యూటీ రేంజ్ అధికారి ఇర్ఫానొద్దీన్, ఎఫ్ఎస్ఓ హర్షద్‌రాజా, బీట్ ఆఫీసర్ అలీం తదితరులు ఉన్నారు.

'వసంత పంచమి'కి రావాలని ఆహ్వానం

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో వచ్చేనెల 1 నుంచి 3వ తేదీ వరకు వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు రావాలని ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు సోమవారం ఆలయ అధికారులు ఆహ్వానపత్రికను అందించారు. ఆలయ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

మిట్టపల్లి..ఉద్యోగాల కల్పవల్లి

- ఒకే ఊరిలో 50 మందికిపైగా ప్రభుత్వ కొలువులు
- పోలీసులు, సింగరేణి, కార్యదర్శులు ఇలా అనేకం
- వీరంతా సింగరేణి కార్మికుల పిల్లలు
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



అప్పటి ఉపాధ్యాయులు వెంకటస్వామి, రాంచందర్



లిటిల్ స్టార్ కాన్వెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

జైపూర్: మండలంలోని మిట్టపల్లి మారుమూల గ్రామం. ఇక్కడి ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఇక్కడ సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్ బాగుపడుతుందని పెద్దలు తలచారు. స్థానిక యువత మొక్కవోని దీక్షతో ఉజ్వల భవిష్యత్‌పై ఆశతో ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు సాగించారు. ఊరిలో దాదాపు 50 మందికి పైగా వివిధ ప్రభుత్వ కొలువులు సాధించారు. వీరంతా సింగరేణి కార్మికుల పిల్లలు కావడం విశేషం. పోలీసులు, సింగరేణి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ కానిస్టేబుల్, ట్రాన్స్‌కో ఏఈ, లైన్‌మెన్‌గా ఇలా అనేక ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో స్థిరపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు చిరునామాగా ఈ గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది.

అక్షరాలు నేర్పింది ఆ పాఠశాలనే..

మిట్టపల్లిలో 1994లో ప్రారంభమైన లిటిల్ స్టార్ కాన్వెంట్(శ్రీనివాస) హైస్కూల్ ఎంతో మంది విద్యార్థులకు అక్షరాలు నేర్పింది. టేకుమట్ల గ్రామానికి చెందిన అన్నతమ్ముళ్లు సంబోదుల వెంకటస్వామి, రాంచందర్ ఉపాధ్యాయులు వారికి 7వ తరగతి వరకు విద్య బోధించారు. వారంతా ప్రస్తుతం ప్రభుత్వ కొలువులు కొట్టారు. నేడు ఉన్నతస్థానానికి చేరుకున్నారు. కాగా, కాలక్రమేణా 2002లో ఆ పాఠశాల మూతబడింది.

సైకిళ్లపై 5 కి.మీ. వచ్చి..

గ్రామంలో ఉన్నత విద్యకోసం విద్యార్థులు మండల కేంద్రానికి వచ్చేవారు. సైకిళ్లపై 5 కి.మీ దూరం వచ్చి వెళ్తుండేవారు. గురుకులం, జెడ్పీ, ప్రైవేట్ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుకున్నారు. పోటీ పరీక్షల్లో సత్తాచాటి ప్రభుత్వ కొలువులు సాధించారు.

పోలీస్ బ్రదర్స్



రాజ్‌కుమార్, ఎస్సై



రవికుమార్, ఎస్సై

గోదారి అమృత–లచ్చయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. ఇద్దరు కూతుళ్లు. లచ్చయ్య సింగరేణి ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాడు. పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ 2014లో ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అన్నను ఆదర్శంగా తీసుకున్న తమ్ముడు రవికుమార్ పట్టుదలతో చదివి 2020లో ఎస్సై ఉద్యోగం సాధించాడు. రాజ్‌కుమార్ హన్మకొండలో విధులు నిర్వర్తిస్తుండగా, రవికుమార్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పని చేస్తున్నాడు. ఈ బ్రదర్స్ ఒకే స్కూల్‌లో చదివి పట్టుదలతో పోలీసుశాఖలో ఉద్యోగాలు సాధించారు.

అన్నాచెల్లెళ్ల ఇద్దరికీ కొలువులే



దూట రాజమల్లు, సింగరేణి క్లర్క్



శ్రీలక్ష్మి, గ్రామ కార్యదర్శి

ఒకే పాఠశాలలో చదివిన తాము అన్నాచెల్లెళ్లు. అన్నగా తాను సింగరేణిలో క్లర్క్ ఉద్యోగం సాధించాను. నా చెల్లి పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైంది. నేను ఎస్టీపీపీలో విధులు నిర్వర్తిస్తుండగా చెల్లెలు చెన్నూర్ మండలంలో కార్యదర్శిగా పనిచేస్తోంది.

డిప్యూటీ కలెక్టర్ కావడమే లక్ష్యం



వరుసగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్‌బీఐలో పనిచేస్తూనే సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఉన్నతస్థానంలో ఉండాలని మళ్లీ చదివి అటవీశాఖలో (ఎఫ్ఆర్‌వో) ఉద్యోగం సాధించాను. భూపాలపల్లి జిల్లా ములుగులో విధులు నిర్వర్తిస్తున్నాను. డిప్యూటీ కలెక్టర్ కావడమే లక్ష్యంగా ఇటీవల గ్రూప్–1 పరీక్ష రాశాను. – శ్రీరామ్‌కుమార్, రేంజ్ అధికారి

పట్టుదలతో చదివాను



తాను పోలీస్ ఉద్యోగం సాధించాలని కలలుగన్నా. కష్టపడి చదివి 2019లో ఎస్సై ఉద్యోగం సాధించాను. ఇప్పుడు నిజామాబాద్ జిల్లా దర్పపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్నాను. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు. – రామకృష్ణ, ఎస్సై

78 కిలోల గంజాయి దహనం



ఎలక్ట్రిక్ యంత్రంలో దహనం చేస్తున్న దృశ్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో నమోదైన 26 కేసుల్లో పట్టుబడ్డ 78 కిలోల 295 గ్రాముల గంజాయిని పోలీసులు సోమవారం దహనం చేశారు. గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌కు తరలించిన పోలీసులు అక్కడి ఎలక్ట్రిక్ యంత్రంలో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీసీఆర్బీ డీఎస్పీ సీహెచ్.నాగేందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.పాండేరావు, డీసీఆర్‌బీ ఎస్సై హకీమ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా రాధిక



బాధ్యతలు స్వీకరిస్తున్న రాధిక

మంచిర్యాల టౌన్: ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా మంచిర్యాలకు చెందిన గైనకాలజిస్టు వైద్యురాలు రాధిక నియమితులయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాకు గత మూడేళ్లుగా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ లేకపోవడంతో ఉమ్మడి జిల్లా మేనేజర్ సత్యనారాయణ అదనపు బాధ్యతలను ఇన్నాళ్లుగా నిర్వర్తించారు.

ఆర్జీయూకేటీ బలోపేతానికి చర్యలు

- ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీ బలోపేతానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. సోమవారం బాసర పరిపాలన భవనంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో ఓఎస్‌డీ మురళీదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో సెమిస్టర్ ప్రారంభమవుతున్న సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలు, నిర్వర్తించాల్సిన విధులు, అకాడమిక్స్, సంబంధిత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ, ఇంటెన్షిప్, లైబ్రరీ బలోపేతం, పీయూసీ విద్యార్థులకు కంప్యూటర్‌ల్యాబ్ ఏర్పాటు, ఇంజనీరింగ్ విద్యార్థులకు గేట్ తరగతుల నిర్వహణ, టెక్‌ఫెస్ట్, కల్చరల్‌ఫెస్ట్,స్పోర్ట్స్ డే, తదితర కార్యక్రమాలను మార్చిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ విభాగం నుంచి బడ్జెట్ ప్రపోజల్‌ను అందించాలని సూచించారు.

జిన్నింగ్‌మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- జైనూర్‌లో ఘటన
- వేల క్వింటాళ్ల పత్తి దగ్ధం
- రూ.కోటికి పైగా నష్టం!



కాలిపోతున్న పత్తి కుప్పలు

జైనూర్: మండల కేంద్రంలోని సర్రాన్ జిన్నింగ్ మిల్లులో సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి విక్రయించేందుకు వచ్చిన ఐచర్ వాహనంలో పత్తిని అన్‌లోడ్ చేసే క్రమంలో సైలెన్సర్ నుంచి వెలువడిన నిప్పురవ్వలు పత్తికి అంటుకుని మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలో వ్యాపించడంతో పత్తి నిల్వలు భారీగా దగ్ధమయ్యాయి. నిర్వాహకులు మంటలార్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా రావడంతో అప్పటికే వేల క్వింటాళ్ల పత్తి అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో రూ.కోటి పైగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, నాయకులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దట్టమైన పొగ మంటలు చెలరేగడంతో ప్రజలు జిన్నింగ్ మిల్లు వద్ద భారీగా గుమిగూడారు. కాగా, ప్రమాద నష్టంపై పంచనామా నిర్వహించి వివరాలు వెల్లడిస్తామని అధికారులు, నిర్వాహకులు తెలిపారు.

పత్తి పంటకు నిప్పు



కాలిన పత్తిని చూపుతున్న బాధిత రైతు

భీమిని: మండలంలోని పెద్దపేట పంచాయతీ పరిధి మెత్తం గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు పత్తికి నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులో రైతు గుర్ల పోశన్న తన పత్తి చేను వద్ద సుమారు 50 క్వింటాళ్ల పంట నిల్వ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం ఉదయం పత్తికి నిప్పు పెట్టారు. చుట్టుపక్కల రైతులు గమనించి బాధిత రైతుకు సమాచారం అందించారు. గ్రామస్తులు, రైతులు నీటితో మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు 5 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. తనకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు వారిని వేడుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు..

కైలాస్‌నగర్: పట్టణంలోని మహాలక్ష్మివాడకాలనీలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. యజమాని కవిత పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న బాధితురాలు కాలిపోయిన వస్తువులను చూస్తు రోధించింది. ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

టిఫిన్ సెంటర్ వాహనం..



దగ్ధమవుతున్న వాహనం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాగులవాడకాలనీలో టిఫిన్ సెంటర్ వాహనం దగ్ధమైంది. కాలనీలో అద్దెకు ఉంటున్న నరేశ్ ఆదివారం ఇంటి ఎదుట వాహనం నిలిపి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో వాహనంలోని బ్యాటరీ నుంచి ఒక్కసారి మంటలు చెలరేగాయి. గమనించిన కాలనీవాసులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- మాలేపూర్ ఘాట్ వద్ద ప్రమాద ఘటన
- డ్రైవర్ నిర్లక్ష్యమేనని పోలీసుల నిర్ధారణ
- కేసు నమోదు, అరెస్టు
- ఇప్పటివరకు ఇద్దరి మృతి
- క్షతగాత్రులకు రిమ్స్‌లో చికిత్స

విచారణ కొనసాగుతుంది..



మాలేపూర్ ఘాట్ సెక్షన్ వద్ద జరిగిన ప్రమాదానికి సంబంధించి విచారణ కొనసాగుతుంది. డ్రైవర్‌ను అరెస్ట్ చేశాం. 35 మంది క్షతగాత్రులు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. – కాజల్, ఉట్నూర్ ఏఎస్పీ

సాక్షి,ఆదిలాబాద్: నార్నూర్ మండలం మాలేపూర్ శివారులో ఘాట్ సెక్షన్ వద్ద ఆదివారం ఐచర్ బోల్తా పడిన ఘటనలో విచారణ కొనసాగుతుందని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ తెలిపారు. గుడిహత్నూర్ మండలం పూనగూడ తోషం గ్రామానికి చెందిన డ్రైవర్ కనక శ్రీరామ్ (26) డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాన్ని నడిపినట్టు గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారిస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్‌పై నార్నూర్‌లో కేసు నమోదు చేశారు. అరెస్టు చేశారు.

క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స..

గుడిహత్నూర్ మండలం సూర్యగూడ, ఇంద్రవెల్లి మండలంలోని సాలెవాడకు చెందిన ఆదివాసీలు జంగుబాయిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం ఐచర్ వాహనంలో బయల్దేరారు. కాప్లే జంగుబాయి వద్ద పుణ్యస్నానాలు, దర్శనం కోసం వెళ్లారు. ఈక్రమంలో సాయంత్రం మాలేపూర్ ఘాట్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ నిర్లక్ష్యం ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఇదిలా ఉంటే ఇప్పటివరకు ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి



తొడసం నాగుబాయి (ఫైల్)

ఇంద్రవెల్లి: నార్నూర్ మండలంలోని మాలేపూర్ ఘాట్ వద్ద ఐచర్ బోల్తాపడిన ఘటనలో తీవ్ర గాయలైన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంద్రవెల్లి మండలంలోని సాలేగూడకు చెందిన తొడసం నాగుబాయి(70) గుడిహత్నూర్ మండలం సూర్యగూడలోని బంధువులతో కలిసి జంగుబాయి దేవత ఉత్సవాలకు ఐచర్ వాహనంలో వెళ్తోంది. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజమున మృతిచెందింది. ఆమె మృతితో సాలేగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి కుమారులు సుదర్శన్, మనోహర్ ఉన్నారు.

అనారోగ్యంతో కొడుకు చనిపోయాడని..

- గోదావరిలో దూకి తండ్రి ఆత్మహత్య
- బాసరలో ఘటన



శివరాం మృతదేహం

బాసర: అనారోగ్యంతో కొడుకు చనిపోయాడని తట్టుకోలేని తండ్రి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బాసరలో చోటుచేసుకుంది. ఎస్సై గణేశ్ కథనం ప్రకారం..నిజామాబాద్ జిల్లా జాన్కంపేట్ గ్రామానికి చెందిన శివరాం (62)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తండ్రి శివరాం దిగులుగా ఉంటున్నాడు. అనారోగ్యంతో కొడుకు మృతితో మనోవేదనకు గురయ్యాడు. సోమవారం బాసరకు చేరుకుని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. పెద్దకుమారుడు సతీశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: షెడ్యూల్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించి ఆదివాసీలతో భర్తీ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో జీవో నంబర్ 3తో పాటు గిరిజన సంక్షేమ శాఖ జీవో నంబర్ 29 లతో కలిపి ఆదివాసీలకు వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఎల్టీఆర్ 1/59, 1/70, ఆర్వోఎఫ్ఆర్, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోడు రైతులకు పట్టాలివ్వాలన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

చెన్నూర్‌రూరల్: మండలంలోని పోన్నారం సమీపంలో ముందస్తు సమాచారంతో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం కోడిపందేల స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో మూడు పందెం కోళ్లు, మూడు సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, 9 బైక్‌లతోపాటు రూ.2630 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇద్దరిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మేకలను కట్టేయవద్దన్నందుకు గొడ్డలితో దాడి



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

రెబ్బెన: దారిలో మేకలను కట్టేయవద్దన్నందుకు ఒకరిపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. మండలంలోని కొండపల్లిలో ఈ ఘటన చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సునార్కర్ శంకర్ ఇంటి వెనకాల చునార్కర్ తుకారాం ఇల్లు ఉంది. శంకర్ ఇంటి పక్కనుంచి దారిలో వెళ్లాలి. గత కొంతకాలంగా ఆ దారిలో తుకారాం..మేకలను కట్టేస్తున్నాడు. గత 20 రోజుల క్రితం శంకర్ తన ఇంటికి కొత్త రంగులు వేశాడు. అక్కడ మేకలు కట్టేయడంతో గోడలపై బురదపడుతుంది. ఈ విషయమై ఆదివారం సాయంత్రం మేకలు ఇంటికి వచ్చే సమయంలో వాటిని ఇంట్లో కట్టేసుకోవాలని శంకర్ కోరగా, తుకారం ఆగ్రహించాడు. దుర్భాషలాడుతూ గొడ్డలితో శంకర్‌పై దాడి చేశాడు. తీవ్ర గాయాలైన అతన్ని కుటుంబీకులు ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య కమల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి సోమవారం విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఘటన స్థలానికి వెళ్లి దాడికి గల కారణాలను ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు.

శ్రమదోపిడీని ఉపసంహరించుకోవాలి

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



సత్తయ్యకు మెమోరాండం సమర్పిస్తున్న కార్మికులు

నస్పూర్: సింగరేణి కార్మికుల వేతన శ్రమదోపిడీని యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని సింగేరణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీరాంపూర్ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గనుల్లో జనరల్ మజ్దూర్ ఖాళీల భర్తీకి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. దీనిప్రకారం కార్మికులకు వేజ్ ప్రొటెక్షన్ కల్పించాల్సిన యాజమాన్యం కార్మికుల మూల వేతనం నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేలు మినహాయించుకుని వారిని ఆర్థిక దోపిడీకి గురిచేస్తోందన్నారు. అనంతరం పలువురు కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ సత్తయ్యకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి రాజేందర్, శ్రీకాంత్, శంకర్, కిశోర్, రవీందర్, సత్యనారాయణ, రామస్వామి, రాజయ్య, శ్రీనివాస్, వేణు, తిరుపతి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.